క్లుప్తంగా

భోగేశ్వరస్వామికి మహా రుద్రాభిషేకం



భోగేశ్వరస్వామి

గడివేముల: మండలంలోని గడిగరేవుల గ్రామంలో కొలువైన.. దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన శ్రీ దుర్గా భోగేశ్వర స్వామి వారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్ సుందర్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి మహా రుద్రాభిషేకం, అష్ట విధ మహా మంగళ హారతులు, మంత్రపుష్పం తదితర పూజలు చేపట్టారు. అమ్మవారికి కుంకుమార్చన జరిపించారు. భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

వృథాను అరికట్టరూ!



పాణ్యం జగనన్న కాలనీలో ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న నీరు

పాణ్యం: స్థానిక మేకలబండలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో దాదాపు 400పైగా ఇళ్లను నిర్మించుకుంటున్నారు. ఇప్పటికే చాలా మంది సొంతిళ్లలో చేరారు. వీరి కోసం నాలుగు మినీ ట్యాంక్‌లను ఏర్పాటు చేశారు. అయితే మొద టి ట్యాంక్‌కు బోర్‌ను నుంచి వచ్చే నీరు నిత్యం వృథాగా పారిపోతోంది. దీంతో చుట్టు పక్కల ప్రదేశాలు బురదమయంగా మారాయి. నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలి



హంద్రీలోని మంచినీటి పథకాలను పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు

కోడుమూరు రూరల్: రక్షిత మంచినీటి పథకాల ద్వారా ప్రజలకు సక్రమంగా తాగునీటిని అందించాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కోడుమూరు హంద్రీ నదిలోని మంచినీటి పథకాలను ఏఈ ప్రసాద్‌తో కలిసి డీఈఈ పరిశీలించారు. డీఈఈ మాట్లాడుతూ.. ట్యాంకులను ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయించడంతో పాటు, హంద్రీ నది నుంచి వచ్చే నీటిని క్లోరినేషన్ చేసిన తర్వాతనే కొళాయిలకు సరఫరా చేయాలని సూచించారు. పైపులైన్లకు లీకేజీలు లేకుండా చూసుకోవాలని, ఏవైనా లీకేజీ లున్నా, మోటార్ల రిపేర్లు ఉన్న వెంటనే బాగు చేయించాలని ఏఈని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

- ఇబ్బందులుంటే 74229 92299 ఫోన్ నంబర్‌కు సమాచారమివ్వండి

కర్నూలు (టౌన్): ఈనెల 17వ తేదీ వరకు వాతవరణంలో మార్పులు, భారీ వర్షాల సూచన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు నగరపాలక కమిషనర్ సోంగా రవీంద్రబాబు సోమవారం నగరపాలకలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. ఏవైనా ఇబ్బందులు ఉంటే నగర ప్రజలు 74229 92299 సెల్ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని తెలిపారు. కంట్రోల్ రూమ్‌లో టీ.స్టెఫెన్, జి.సుధీర్, సుహేయిల్ జాకీర్ ఖాన్ అనే ముగ్గురు సచివాలయాల ఉద్యోగులు మూడు షిఫ్టల ప్రకారం 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని కమిషనర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, తగు ప్రత్యమ్నాయ చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.

జిల్లా అభివృద్ధి ప్రణాళిక రూపొందించండి

- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులను ఆదేశించిన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్

కర్నూలు (సెంట్రల్): స్వర్ణాంధ్ర విజన్–2047కి సంబంధించిన జిల్లా యాక్షన్ డాక్యుమెంట్ ప్లాన్‌ను త్వరితగతిన రూపొందించి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఆయన సోమవారం విజయవాడ సీఎస్ కార్యాలయం నుంచి 'గ్రాస్ స్టేట్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీఎస్‌డీపీ) సెన్సిటైజేషన్', 'స్వర్ణాంధ్ర విజన్ 2047' అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 శాతం గ్రోత్ యాన్యువల్‌గా రావాలంటే ఎలాంటి లక్ష్యాలు నిర్దేశించుకోవాలి, ముఖ్యంగా ఎకానమీలో 3 రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీస్)కి సంబంధించిన వాటిలో ఏ విధంగా ఇంప్రూవ్ చేయవచ్చు అనే దానిపై స్వర్ణాంధ్ర విజన్–2047కి సంబంధించిన జిల్లా యాక్షన్ డాక్యుమెంట్ ప్లాన్‌ను త్వరితగతిన రూపొందించి సమర్పించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ఇప్పటికే అన్ని జిల్లాల్లో మండలాల వారీగా ప్రణాళికలు రూపొందించారని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, సీపీఓ హిమ ప్రభాకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కాలువ నిండుగా.. చెరువు ఖాళీగా!

- హంద్రీనీవా కాలువ నిండుగా ప్రవహిస్తున్నా తడకనపల్లె చెరువుకు చేరని నీరు
- బీడు భూమిని తలపిస్తున్న వైనం
- తాగునీటికి ఇక్కట్లు తప్పవంటున్న జనం
- సమీపంలోని బోర్లలో అడుగంటిన భూగర్భ జలాలు
- పంటల సాగుకు అందని నీరు



అడుగంటిన తడకనపల్లె చెరువు



నిండుగా ప్రవహిస్తున్న హంద్రీ-నీవా కాలువ

కల్లూరు: హంద్రీనీవా కాలువ నిండుగా ప్రవహిస్తోంది.. ఆ పక్కనేనున్న తడకనపల్లె చెరువు మాత్రం చుక్క నీరు లేక బీడు భూమిని తలపిస్తోంది. చెరువులో నీరుంటే సమీప గ్రామాల్లోని వ్యవసాయ బోర్లలో నీటి మట్టం సమృద్ధిగా ఉండి పంటల సాగుకు ఇక్కట్లు ఉండవని రైతులు పేర్కొంటున్నారు. ఇక తడకనపల్లెతో పాటు వామసముద్రం, ఓబులాపురం, ఓబులాపుం తండా గ్రామాలకు తాగునీరు ఈ చెరువు నీరే ఆధారం. చెరువు కింద దాదాపు వంద ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. అలాగే.. సమీప పొలాల రైతులు నీటిని పంటలకు మళ్లించుకుంటారు. ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమైనా.. చెరువను హంద్రీ నీవా నీటితో నింపకపోవడంతో తడకనపల్లె, మజరా గ్రామాలైన వామసముద్రం, ఓబులాపురం, ఓబులాపురం తండా గ్రామ ప్రజలు, రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేసవిలో తీవ్ర నీటి ఎద్దడి ఎదురయ్యే అవకాశముందని, ఇప్పటికైనా చెరువును నింపాలని కోరుతున్నారు. ఇక చెరువులో నీరు లేక బోర్లలో నీటి మట్టం అడుగంటి పంటలకు సరిపడ నీటి తడులు అందించలేకపోతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో హంద్రీనీవా కాలువ నుంచి మోటార్ల ద్వారా చెరువును నింపేవారు.

హామీ ఏమైంది?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే చెరువులను హంద్రీ-నీవా నీటితో నింపుతామని నాయకులు హామీనిచ్చారు. తుంగభద్ర నుంచి నదిలో పుష్కలంగా నీరు ప్రవహిస్తుంది. శ్రీశైలం జలాశయం నిండుగా ఉంది. హంద్రీనీవాలోనూ నీరు సమృద్ధిగా పారుతోంది. అయినా చెరువులకు నీటిని మళ్లించక పోవడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఖరీఫ్ ముగిసినా నాయకులకు మెలకువ రాలేదా అని ప్రశ్నిస్తున్నారు. త్వరలో రబీ కూడా ముగిస్తే నీటి వనరులు అడుగంటిపోతాయని, అప్పుడు చెరువులు ఎలా నింపుతారని నిలదీస్తున్నారు.చెరువులో నీరుంటే రబీ సీజన్‌లో వేసే పంటలకు బోర్లు బాగా పని చేస్తాయి. లేకపోతు బోర్లు ఎండిపోయ్యే ప్రమాదం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో నీటి ఎద్దడి నివారణ..

చెరువులో నీరు ఉంటే తడకపల్లె గ్రామంతో పాటు మజరా గ్రామాలైన వామసముద్రం, ఓబులాపురం, ఓబులాపురం తండా గ్రామాల్లో తాగునీటి సమస్య ఉండదు. వేసవి కాలంలో నాలుగు గ్రామాలకు తాగునీటితో పాటు, గొర్రెలు, పశువులకు దాహార్తి తీరేది. చెరువు ఖాళీగా ఉండటంతో ఆయా గ్రామాల ప్రజలకు వేసవిలో తాగునీటి కష్టాలు వచ్చే అవకాశముంది.

చెరువును నీటితో నింపాలి



చెరువును నీటితో నింపడం వల్ల ఎంతో ఉపయోగంగా ఉంటుంది. చెరువును నీటితో నింపితే భూగర్భ జలాలు పెరిగి పొలాలో బోర్ల నుంచి పంటలకు సరిపడ నీరు అందుతుంది. దీంతో రైతులు వేసవి కాల పంటలకు ఇబ్బంది ఉండదు. ఇక ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తదు.

– సాయి, తడకనపల్లె.

తాగునీటి సమస్య తప్పదు



చెరువులో నీరు ఉంటే తడకనపల్లెతో పాటు వామసముద్రం, ఓబులాపురం, ఓబులాపురం తండా గ్రామాలకు తాగునీటి ఇక్కట్లు ఉండవు. అలాగే పశువులకు, గొర్రెలు యాజమానులు నీటి కోసం సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. జనంతో పాటు పశువుల దాహార్తి తీరుతుంది. అధికారులు స్పందించాలి.

– వెంకటేష్, తడకనపల్లె

నేడు విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం నగరంలోని గణేష్ నగర్, రామచంద్రమిషన్ ఏరియా, రెవెన్యూ కాలనీ, సీ క్యాంపు, శ్రీరామ్ నగర్‌లలో విద్యుత్ కోతలు విధిస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 10:30 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

గ్రామాల్లో కోతలు...

మండల పరిధిలోని పంచలింగాల 33 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతులు, నిర్వహణ పనుల నిమిత్తం మంగళవారం పంచలింగాల, గొందిపర్ల, ఈ తాండ్రపాడు, దేవమడ, పంచలింగాల స్కందాకు విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఈఈ శేషాద్రి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు వెల్లడించారు. గ్రామీణ ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

నేడు 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

సి.బెళగల్: మండల పరిధిలోని రెండు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో.. ఈ వారం కార్యక్రమ నిర్వహణలో భాగంగా మంగళవారం ఉదయం మండలంలోని కొండాపురం గ్రామ సచివాలయ కార్యాలయంలో, మధ్యాహ్నం ముడుమాల గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో రైతులతో ×పొలం పిలుస్తోంది× కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు ఏఓ తెలిపారు. ఆయా గ్రామాల రైతులు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

ఓర్వకల్లు: పల్లె పండుగ, పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. ప్రధానంగా ముస్లింలకు ఈద్గాలను నిర్మిస్తామని తెలిపారు. అలాగే ఎస్సీలు, ముస్లింల శ్మశానవాటికల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు. మండలంలో రూ.2.30 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, బీటీ రోడ్లు నిర్మిస్తామని తెలిపారు. టీడీపీ మండల కన్వీనర్ గోవింద్‌రెడ్డి, నాయకులు లక్ష్మీకాంతారెడ్డి, విశ్వేశ్వరరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పింఛన్లలో మార్పులు, చేర్పులు, హౌసింగ్ సమస్యలు, రెవెన్యూ పరమైన సమస్యలపై 104 వినతులు వచ్చినట్లు తెలిపారు. ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంపీపీ తిప్పన్న, జెడ్పీటీసీ రంగనాథ్‌గౌడు పాల్గొన్నారు.

పాణ్యం: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో నూతన రోడ్లు వేస్తున్నట్లు డీపీఓ జమీవుల్లా తెలిరు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా స్థానిక బీసీ కాలనీలో నూతన సీసీ రోడ్లకు భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ రూ.2.5కోట్లతో నూతన సీసీ రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, ఈఓఆర్డీ చంద్రమోశేశ్వరరరెడ్డి, మండల ఇంజినీర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.

కల్లూరు: పల్లె పండగ– పంచాయతీ వారోత్సవాల కార్యక్రమంలో భాగంగా సోమవారం మండల ప్రత్యేక అధికారి దీప్తి, ఎంపీడీఓ నాగేషాచలరెడ్డి ఉలిందకొండ, యాపర్లపాడు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉలిందకొండ గ్రామ పంచాయతీతో పాటు మజరా గ్రామాలైన ఎర్రకత్వ, కొలంపల్లితండా, యాపర్లపాడు గ్రామాల్లో రోడ్ల పనులు సంక్రాంతిలోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.సర్పంచ్‌లు మాసెపోగు సుంకులమ్మ, వెంకట్రామిరెడ్డి, పీఆర్ ఏఈ రవిమోహన్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సతీష్, ఈఓఆర్డీ నాగేష్ ఏపీఓ మద్దేశ్వరమ్మ, ఏపీ ఫైనాన్స్ అర్బన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ రామాంజనేయులు పాల్గొన్నారు.

గడివేముల: మండల వ్యాప్తంగా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఎంపిక చేసిన పనులకు సోమవారం శంకుస్థాపనలు జరిగాయి. మండలంలోని బిలకలగూడూరు, బూజనూరు,ఆళ్లగడ్డ అధికారులు, ప్రజాప్రతినిధులు సీసీ రోడ్లు, డ్రైనేజీలు తదితర పనులకు భూమి పూజ చేసినట్లు ఎంపీడీఓ వాసుదేవ గుప్త తెలిపారు. ఆయన మాట్లాడుతూ పల్లె పండుగ కింద ఉపాధిహామీ నిధులతో ఎంపిక చేసిన పనులకు ఈ నెల 14 నుంచి 20 వరకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. మండలంలో 37 పనులకు రూ.2.50 కోట్ల నిధులు మంజూరైనట్లు చెప్పారు.

సమస్యలను త్వరగా పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉశేన్‌బీ

పాణ్యం: మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఎంపీపీ ఉశేన్‌బీ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించి, పునరావృతం కాకుండా చర్యలు తీసుకునే బాధ్యత అధికారులదేనన్నారు. తుఫాన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రజలను అప్రమత్తం చేయాలని, గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూడాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ప్రజలకు సురక్షిత మంచినీరు సరఫరా చేయాలని, విద్యుత్, రోడ్ల సమస్యలపై దృష్టి సారించాలని చెప్పారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కేఎంసీ కీర్తి ప్రతిష్టలు కొనసాగాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ, వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజీ కీర్తి ప్రతిష్టలు కొనసాగేలా వైద్య విద్యార్థులు చదువుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. 2024–25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ తీసుకున్న మొదటి సంవత్సరం వైద్య విద్యార్థులకు సోమవారం కళాశాలలోని న్యూ లెక్చర్ గ్యాలరీలో రెండు వారాల ఫౌండేషన్ కోర్సు ప్రారంభించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి విద్యార్థి క్రమ శిక్షణతో మెలగాలని, హాజరు శాతం 75 శాతానికి తగ్గకుండా ఉండాలని సూచించారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల గురించి నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి సమస్య ఎదురైనా తమ దృష్టికి తీసుకురావాలని, సీనియర్ ప్రొఫెసర్ల బృందం వాటిని పరిష్కరిస్తుందన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. వైద్య విద్య ఎంతో ఉన్నతమైనదని, కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలగాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుకాదేవి, డాక్టర్ విజయానందబాబు, హాస్టల్ ఇన్‌చార్జ్‌లు ప్రొఫెసర్ డాక్టర్ మాధవీశ్యామల, డాక్టర్ సోమశేఖర్,ఈయూ కో–ఆర్డినేటర్ డాక్టర్ సింధియా శుభప్రద, ఆయా విభాగాల అధిపతులు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

పల్లెల అభివృద్ధే లక్ష్యం



గొందిపర్లలో భూమిపూజలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కర్నూలు (రూరల్): మండల పరిధిలో గొందిపర్ల గ్రామంలో పల్లె పండుగ వారోత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా, కోడుమూరు ఎమెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. గ్రామంలో ఇందిరమ్మ కాలనీలో రూ.14 లక్షలతో 8 ఫారం పాండ్స్, రూ.6.15 లక్షలతో ఫీల్డ్ చానల్స్, రూ.12 లక్షలతో సీసీ రోడ్లు, రూ.4.6 లక్షలతో గోకులాలు, రూ.4 లక్షలతో చేపట్టనున్న ఇతర పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పల్లె పండుగ ద్వారా జిల్లాలో రూ.82 కోట్లతో 1562 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వివరించారు. కొడుమూరు నియోజకవర్గంలో రూ.12.65 కోట్లతో, కర్నూలు మండలంలో రూ.4.28 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. గ్రామసభలు నిర్వహించి ప్రాధాన్యత క్రమంలో పనులు పూర్తి చేస్తామన్నారు. ఎమ్మెల్యే దస్తగిరి మాట్లాడుతూ పల్లెలను అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమని పేర్కొనారు. జెడ్పీ సీఈఓ నాసర రెడ్డి, డ్వామా పీడీ మాధవీలత, డీపీఓ భాస్కర్, సర్పంచ్ శ్రీనువాసులు, ఎంపీటీసీ కృష్ణవేణి, ఎంపీడీఓ రఘునాథ్, ఈఓఆర్డీ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు (రూరల్): మండల పరిధిలోని గ్రామాల్లో పల్లె పండుగ – పంచాయితీ వారోత్సవాలు సోమవారం దేవమాడ, పంచలింగాల, ఆర్.కొంతలపాడు, సుంకేసుల, తొలిశాపురం, రేమట, గొందిపర్ల గ్రామలలో ఎంపీడీఓ రఘునాథ్, ఈఓఆర్డీ అనురాధ ఆధ్వర్యంలో నిర్వహించారు. పల్లెల అభివృద్ధి కోసం కర్నూలు మండలానికి రూ.4.28 కోట్ల నిధులు కేటాయించారని అధికారులు తెలిపారు. ఈ నిధులతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో ఫారం పాండ్స్, ఫీల్డ్ చానల్స్, సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, గోకులాలు, తదితర అభివృద్ధి పనులు చేపడతామని వెల్లడించారు.

లక్కీ డ్రా విజేతలు వీరే

కోడుమూరు రూరల్: నూతన మద్యం పాలసీలో భాగంగా లక్కీ డ్రాలో దుకాణాలను దక్కించుకున్న వారి వివరాలను కోడుమూరు ఎక్సైజ్ సీఐ మంజుల సోమవారం వెల్లడించారు. సీఐ మాట్లాడుతూ.. కోడుమూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 14 మద్యం దుకాణాలకు మొత్తం 510 దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిని సోమవారం కర్నూలులో డ్రా తీయగా, కోడుమూరులోని 5 మద్యం దుకాణాలను సుగాలి లక్ష్మిదేవి, నరేష్, సాయ రాజేంద్ర, కురువ వెంకటేశ్వరమ్మ, కేతు మల్లికార్జున గౌడ్ దక్కించుకున్నారన్నారు. అలాగే గూడూరులోని 3 మద్యం దుకాణాలను సోమనాథ్ గౌడ్, సంగాల మధు, సుగాలి లక్ష్మిదేవి, వెల్దుర్తిలోని 3 దుకాణాలను దిలీప్ కుమార్‌రెడ్డి, వెంకటేష్, వెంకటకృష్ణ, సి.బెళగల్‌లోని 2 మద్యం దుకాణాలను మధుసూదన్ రెడ్డి, వెంకట్రామిరెడ్డి, కృష్ణగిరిలోని ఒక మద్యం దుకాణాన్ని విశ్వనాథ్‌గౌడ్ దక్కించుకున్నట్లు సీఐ మంజుల వెల్లడించారు.

కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

కోడుమూరు రూరల్: గ్రామస్తులంతా కలిసికట్టుగా ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని కోడుమూరు ఎంపీడీఓ రాముడు సూచించారు. సోమవారం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వెంకటగిరి, కల్లపరి గ్రామాల్లో అధికారులు సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి భూమి పూజలు నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పల్లె పండుగ కార్యక్రమంలో ప్రతి గ్రామంలోనూ గుర్తించిన అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందన్నారు. పీఆర్ ఏఈ గంగరాజు మాట్లాడుతూ.. వెంకటగిరిలో రూ.25లక్షలతో సీసీ రోడ్లు, డ్రైన్లు, కల్లపరిలో రూ.16 లక్షలతో సీసీరోడ్లు, డ్రైన్లు నిర్మించడం జరుగుతుందన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా నేడు అమడగుంట్ల, ఎర్రదొడ్డి గ్రామాల్లో.. అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ రాముడు సోమవారం తెలియజేశారు.

'పల్లె పండుగ'లో సమస్యల ఏకరువు



బ్రాహ్మణదొడ్డిలో సమస్యలను అధికారులకు తెలుపుతున్న గ్రామస్తులు

సి.బెళగల్: పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాలలో అభివృద్ధి పనులను ప్రారంభించడం జరుగుతుందని ఎంపీడీఓ రాణెమ్మ అన్నారు. సోమవారం సి.బెళగల్ మండలంలోని బ్రాహ్మణదొడ్డి గ్రామంలో సర్పంచ్ దస్తగిరి అధ్యక్షతన పంచాయతీ కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి గ్రామ సచివాలయంలో పల్లె పండుగ కార్యక్రమంను నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ, ఉపాధి హామి ఏపీఓ రామన్న గ్రామంలో చేపట్టే పనులను గ్రామస్తులకు తెలియజేశారు.

ఎంపీడీఓ తీరుతో నెవ్వెరపోయిన గ్రామస్తులు

గ్రామ సచివాలయ ఉద్యోగులు పనులు చెయ్యడం లేదని, సమయపాలన పాటించడం లేదని, విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని గ్రామస్తులు సమస్యలను లేవనెత్తారు. ఉద్యోగులు వచ్చిన సమయంలోనే వారితో పని చేయించుకోవాలని, విధులకు కొంత ఆలస్యంగా రావడం, కాస్త ముందుగానే వెళ్లడం సాధారణమేనని ఎంపీడీఓ చెప్పడంతో గ్రామస్తులు నెవ్వెరపోయారు. విద్యుత్ సమస్యలుంటే సంబంధిత అధికారులకు ఎందుకు చెప్పలేదని, ఇకపై సమస్యలను మండల అధికారులకు చెప్పే ముందు సంబంధిత ఉద్యోగులకు చెప్పాలనడంపై విస్మయానికి గురయ్యారు. ఉద్యోగుల నిర్లక్ష్యంపై ఫిర్యాదు చేస్తే మండలాధికారులు స్పందించే విధానం ఇదా? అంటూ గ్రామస్తులు చర్చించుకున్నారు.

వీహెచ్‌ఏపై ఆగ్రహం

ఉద్యాన పంటలసాగులో భాగంగా గ్రామానికి చెందిన కృష్ణ జామ మొక్కలను నాటుకున్నాడు. తోట సాగు విధానంపై రైతును ఎంపీడీఓ అడుగగా సస్యరక్షణ పద్ధతులు తనకు తెలియదని, మొక్కలు ఇచ్చి నాటుకోమన్నారే తప్ప, సాగు విధానాలు ఎవ్వరూ చెప్పలేదని బదులిచ్చారు. దీంతో గ్రామ సచివాలయంలో ఉన్న హార్టికల్చర్ అసిస్టెంట్ (వీహెచ్‌ఏ) తీరుపై ఎంపీడీఓ మండిపడ్డారు. రైతులకు అందుబాటులో ఉండి పంటలో సాగులో సస్యరక్షణ పద్ధతులు తెలియజేయాలని, సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా మారందొడ్డి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రఫీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎంపీటీసీ సభ్యురాలు ఉమామహేశ్వరి, గ్రామస్తులు రాఘవేంద్ర, జక్రియాలు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో పదో తరగతి ఆపై చదివిన అభ్యర్థులకు ఈనెల 16న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఫస్ట్‌స్టెప్ కంప్యూటర్ శిక్షణ కేంద్రం అధ్యక్షుడు ఎస్.రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింహా హెచ్‌ఆర్ సర్వీసెస్ ఆధ్వర్యంలో చిత్తూరు శ్రీసిటీలోని ప్రముఖ ఏసీ కంపెనీ డైకిన్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాలు ఉన్నాయన్నారు. ఇక్కడ ఖాళీలను భర్తీ చేసేందుకు కంపెనీ వారు 16వ తేదీ ఉదయం 10 గంటల నుంచి 2 గంటల వరకు స్థానిక భాగ్యనగర్‌లోని ఫస్ట్‌స్టెప్ శిక్షణ కేంద్రంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలిపారు. నిరుద్యోగ యువతీయువకులు పూర్తి వివరాలను https://bit.ly/simhosri ద్వారా రిజిస్టర్ చేసుకుని ఇంటర్వ్యూకు హాజరుకావాలన్నారు. అభ్యర్థుల వయస్సు 19 నుంచి 26 ఏళ్లలోపు ఉండాలని, ఎంపికైన వారికి రూ.12,500 నుంచి రూ.14వేల వరకు జీతం, భోజన, వసతి సౌకర్యాలు కల్పిస్తారని చెప్పారు.

ఆర్టీసీ బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు



కోడుమూరులో ఆర్టీసీ బస్సు ఎక్కేందుకు పోటీ పడుతున్న ప్రయాణికులు



ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

కోడుమూరు రూరల్: దసరా సెలవులు ముగియడంతో సోమవారం ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాలన్నీ ప్రయాణికులతో కిటకిటలాడాయి. దసరా సెలవుల సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు, ఉద్యోగులు, ప్రజలు భారీగా స్వస్థలాలకు చేరుకొని పండుగ జరుపుకున్నారు. సోమవారం సెలవులు ముగియడంతో ఆయా ప్రాంతాలకు తిరిగి వెళ్లేందుకు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అయితే రద్దీకి తగ్గట్లు ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రెగ్యులర్ రూట్లలో తిరిగే చాలా బస్సులను స్పెషల్ బస్సుల పేరుతో అధికారుల ఇతర ప్రాంతాలకు మళ్లించడంతో ఉన్న బస్సులు ప్రయాణికుల రద్దీని తట్టుకోలేకపోయాయి. ముఖ్యంగా గుంతకల్, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ ప్రాంతాల నుంచి కోడుమూరు మీదుగా వెళ్లే బస్సులన్నీ ప్రయాణికులతో కిక్కిరిసిపోగా నిల్చోవడానికి కూడా స్థలం లేని జనం ఇబ్బందులు పడ్డారు. దీంతో చేసేదిలేక చాలామంది ప్రయాణికులు ప్రైవేట్ వాహనాల్లో తమ స్వస్థలాలకు తరలివెళ్లారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని ప్రైవేట్ వాహనదారులు విపరీతంగా చార్జీలను పెంచేసి జేబులు నింపుకున్నారు.

వాల్మీకి జయంతి ఘనంగా నిర్వహిద్దాం

కర్నూలు (అర్బన్): రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనున్న వాల్మీకి మహర్షి జయంతిని ఈనెల 17న ఘనంగా నిర్వహించుకుందామని జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారిణి పి.వెంకటలక్ష్మమ్మ అన్నారు. వాల్మీకి జయంతిని విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక సంక్షేమ భవన్‌లోని తన చాంబర్‌లో వాల్మీకి నేతలతో ముందస్తు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జయంతిని ఘనంగా నిర్వహించేందుకు మీరు అందించే సలహాలు, సూచనలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోతామన్నారు. 17వ తేదీన ఉదయం మహర్షి వాల్మీకి విగ్రహానికి పూల మాలలు వేసి పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు జయంతి కార్యక్రమాలను కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి వాల్మీకి సంఘాలకు చెందిన నాయకులతో పాటు బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులందరినీ ఆహ్వానించేందుకు చర్యలు చేపట్టామన్నారు. సమావేశంలో వాల్మీకి సంఘాల నాయకులు కుబేరస్వామి, బేతం కృష్ణుడు, శ్రీనివాసులు నాయుడు, బాల సంజన్న, తలారి కృష్ణమ నాయుడు, రమణ, రామాంజనేయులు, సత్రం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.